క్లుప్తంగా

ఎమ్మెల్యే పర్యటన నేడు

కొయ్యూరు: పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు శుక్రవారం కొయ్యూరు పర్యటించనున్నట్టు ఎంపీపీ బడుగు రమేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ అతిథిగృహం వద్ద పార్టీ నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరుగుతుందని, అందరూ తరలిరావాలని కోరారు.

జి.మాడుగులలో రేపు..

జి.మాడుగుల: మండలంలో భీరం పంచాయతీలో సలమరంగి గ్రామంలో శనివారం పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు తెలిపారు. భీరం పంచాయతీలో గల సలమరంగి గ్రామంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు(గృహ సారథి) కొఠారి కామరాజు మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని ఆయన పరామర్శిస్తారని పేర్కొన్నారు. అనంతరం పార్టీ శ్రేణులతో సమావేశం జరుగుతుందని, మండలంలో నాయకులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొవాలని కోరారు.

ప్రకృతి సాగుపై అవగాహన



రైతులకు సూచనలిస్తున్న సిబ్బంది

మారేడుమిల్లి : డి.వెలమలకోట గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాధికారుల ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కుంజం నందిని రైతులకు ప్రకృతి కషాయం తయారీ విధానాన్ని వివరించారు. వరిలో వచ్చే దోమ నివారణకు తూటికాయ కషాయం వినియోగంపై అవగాహన కల్పించారు. ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేస్తే మంచి గిట్టుబాటు ధర పొందవచ్చన్నారు. రైతులు ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచుకొని సాగుచేసి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఏవో వెంకటేశ్వర్లు పలువురు రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

గూడెంకొత్తవీధి: కొండచరియలు విరిగిపడిన ఘటనలో నిరాశ్రయులైన గిరిజనులకు సహాయం అందించేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలోనే మేము సైతం అంటూ గూడెంకొత్తవీధి మండలం కోరాపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండానే సొంతంగా చట్రాపల్లి గ్రామంలోని బాధితులకు విరాళాలను సేకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేకంగా విరాళాల పెట్టెను తయారు చేసి తమ గ్రామంలో ఏర్పాటు చేశారు. దాతలు ఎవరైనా విరాళాలు ఇస్తే వాటన్నింటినీ పోగుచేసి బాధితులకు తమ వంతు సాయంగా అందిస్తామని చిన్నారులు తెలిపారు.

నిత్యావసర సరకుల పంపిణీ



సరకులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రంగమ్మ

కూనవరం: మండల పరిధిలోని శబరి కొత్తగూడెం, ఏపీఆర్ గురుకులం పాఠశాల, రేగులపాడు, తాళ్లగూడెం, బొజ్జాయిగూడెం పునరావాస కేంద్రాల్లోని వరద బాధితులకు గురువారం నిత్యావసర సరకులను ఎంపీపీ పాయం రంగమ్మ పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో ఆలుగడ్డలు, కేజీ ఉల్లిపాయలు, ఉప్పు ప్యాకెట్, లీటర్ పాల ప్యాకెట్ చొప్పున 827 కుటుంబాలకు సరకులను అందజేశారు. శబరి కొత్తగూడెం సర్పంచ్ కట్టం లక్ష్మి, వీఆర్‌ఓ ధర్మరాజు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

చింతపల్లి: చింతలూరు గ్రామాన్ని చింతపల్లి ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ గురువారం సందర్శించారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. వాతావరణంలో మార్పుల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచివడపోసిన నీటిని, వేడి పదార్థాలను ఆహారంగా తీసుకోవాలనిసూచించారు. గ్రామస్తులకు ఎవరైనా అనారోగ్యానికి గురైతే సమీపంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలన్నారు.

రహ'దారుణాలు'



కోతకు గురైన పెద్దపాడు రోడ్డు



కెందుగుడలో కోతకు గురైన తారురోడ్డు

- వర్షాలకు కోతకు గురైన రహదారులు, కల్వర్టులు, వంతెనలు
- గ్రామస్తుల రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

పెదబయలు: ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తారురోడ్లు దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా మారాయి. రాళ్లు తేలి...గోతులతో దర్శనమిస్తున్నాయి... కొన్ని చోట్ల చిత్తడిగా మారాయి. మండలంలోని రూడకోట నుంచి జామిగుడ పంచాయతీ ఒడిశా బోర్డర్ వరకు నిర్మించిన రోడ్డు చాలా ప్రదేశాల్లో కోతకు గురైంది. కుమడ ఘాట్ వద్ద చాలా వరకు దెబ్బతింది.అలాగే జామిగుడ నుంచి ఒడిశా సరిహద్దు వరకు వెళ్లే మార్గంలో కెందుగుడ, మెట్టగుడ గ్రామ సమీపంలో గతేడాది నిర్మించిన తారురోడ్డు, కల్వర్టులు కోతకు గురై కుంగిపోయింది. దీంతో ఈ రోడ్డుకు రాకపోకలు ప్రస్తుతం నిలిచిపోయాయి. బూరుగుమెట్ట నుంచి కమ్మరిగొయ్యి గ్రామం వరకు తారురోడ్డు ఎక్కువ ప్రదేశాల్లో పాడైంది. పర్రెడ జంక్షన్ నుంచి రూడకోట వరకు తారురోడ్డు ఎక్కువగా గోతులు ఏర్పడి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది.గుల్లేలు పంచాయతీ మర్రిపుట్టు కాజ్‌వే పక్కకు కోతకు గురైయింది. పెదబయలు నుంచి పన్నెడ గ్రామం నుంచి బంగారుమెట్ట వరకు ఆర్అండ్‌బి రోడ్డు గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

కొట్టుకుపోయిన పెద్దపాడు రహదారి

డుంబ్రిగుడ: మండల కేంద్రం నుంచి చాపరాయి మీదుగా పెద్దపాడు, తెంగడవలస, దిబ్బగుడ, వర్ర, సిరాగం మీదుగా అరకులోయ మండలానికి వెళ్లే రహదారి గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. ఈ మార్గంలో పర్యాటక వందలాది వాహనాలు వస్తుంటాయి. ఈ రహదారి కోతకు గురవడంతో తమ అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను సంతలకు తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నరు. తక్షణమే ఈరహదారి పనులు ప్రారంభించి గ్రామస్తులకు అలాగే ఈప్రాంత గిరిజనులకు సౌకర్య కల్పించాలని కోరుతున్నారు.



డుంబ్రిగుడలో దిబ్బగుడ రోడ్డు దుస్థితి

రోడ్డు వేయాలి



మండలంలోని జామిగుడ నుంచి ఒడిశా సరిహద్దు వరకు ఉన్న తారురోడ్డు వర్షాలకు దారుణంగా దెబ్బతిన్నాయి, కెందుగుడ, మెట్టగుడ శ్లాబు కల్వర్టుల పక్కన కోతకు గురైంది. రోడ్డు దెబ్బతింది. గత నెలలో తుపాను ప్రభావంతో కొంత రోడ్డు బీటలు వారింది. ఇటీవల కురిసిన తుఫాను ప్రభావంతో రోడ్డు వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. **– తెరవాడ వెంకటరావు,**
జామిగుడ పంచాయతీ, పెదబయలు మండలం

వర్షాలతో పనులకు ఆటంకం

జామిగుడ నుంచి ఒడిశా సరిహద్దు వరకు తారు రోడ్డు పనులు పూర్తి కాలేదని ప్రగతిలోనే ఉంది. రోడ్డు కోతకు గురికాకుండా సైడ్ వాల్ నిర్మిస్తుండగా వర్షాలు పడి వరదనీరు ప్రవాహానికి రోడ్డు దెబ్బతింది, శ్లాబ్ కల్వర్టులు, కాజ్‌వేలు పక్కన మట్టి కోతకు గురైయింది. వర్షాలు ఎక్కువగా కురుస్తుండడం వల్ల పనులకు ఆటంకం ఏర్పడుతోంది. వర్షాలు తగ్గితే నెల రోజుల్లో పూర్తి స్థాయిలో రోడ్డు పనులు పూర్తి చేయడం జరుగుతుంది.
– పి.రవికుమార్,
డీఈఈ, పంచాయతీ రాజ్ విభాగం పాడేరు

విజయవాడను వరదలో ముంచింది
కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే

- తుపాను హెచ్చరికలు పట్టని ప్రభుత్వం
- ఆస్తి, ప్రాణ నష్టాలకు ముఖ్యమంత్రిదే బాధ్యత
- వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లోను నిర్లక్ష్యమే
- మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి
- వరద బాధితుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం
- అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి



సాక్షి,పాడేరు: ఎన్నడూ లేని విధంగా వరదలతో విజయవాడ ప్రజలు నరకం చూశారని, విజయవాడను వరద నీటిలో ముంచింది కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె గురువారం 'సాక్షి'తో మాట్లాడుతూ 14ఏళ్ల సీఎం అనుభవం అంటూ చెప్పుకునే చంద్రబాబునాయుడు తుపానుపై వాతావరణశాఖ, ఐఎండీల ముందుస్తు హెచ్చరికలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బుడమేరు వాగు ఉధృతి కూడా ప్రభుత్వానికి పట్టించకపోవడంతో విజయవాడ నగరాన్ని వరద నీరు ముంచెత్తి ఇంత ఘోరం జరిగిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని అనేక ప్రాంతాలు వరదలో మునిగిపోయినప్పటికీ, సకాలంలో సహాయ కార్యక్రమాలతో పాటు ప్రజల ఆస్తి, ప్రాణ నష్టాలు లేకుండా చూడడంలోను ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని సకాలంలో అప్రమత్తం చేసి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఉంటే ప్రాణ నష్టం ఉండేది కాదని ఆమె స్పష్టం చేశారు. 50 మంది వరకు ప్రజలు ఈ వరదల్లో మృతి చెందారని, వారి మరణాలకు కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుని ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఆస్తులతో పాటు ఇళ్లు, సామగ్రిని నష్టపోయిన బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్లు, బైక్‌లు కూడా వరదలో కొట్టుకుపోయాయని, వాటిని ఇప్పటికి బాధితులు వెతుక్కునే పరిస్థితి బాధకరమన్నారు. ఈ వాహనాలు మరలా వినియోగంలోకి రావాలంటే ఖర్చు భారీగానే ఉంటుందని, ఆ సొమ్మును కూడా కూటమి ప్రభుత్వమే భరించాలని ఆమె డిమాండ్ చేశారు. వరదల్లో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వమే పక్కా గృహాలను వేగవంతంగా నిర్మించాలన్నారు. వరద బాధితులకు న్యాయం జరిగేంత వరకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో తామంతా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

టీచర్‌కు సన్మానం

రంపచోడవరం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ గౌరవ అధ్యక్షుడు కె. రఘుబాబు అధ్యక్షతన గురువారం ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడు సీహెచ్ రామకృష్ణను ఘనంగా సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో భాగంగా యూటీఎఫ్ నాయకుడు కృష్ణ మాట్లాడుతూ డిసెంబర్ నెలలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. రుక్మిణి దేవి, సత్యకిరణ్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు రామకృష్ణను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు, సహచర సిబ్బంది

చట్రాపల్లి బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

గూడెంకొత్తవీధి: కొండచరియలు విరిగిపడి అన్ని విధాలుగా నష్టపోయిన గిరిజనులను కూటమి ప్రభుత్వం పూర్తిగా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స, నాయకులు చిన్నయ్యపడాల్ కోరారు. కొండచరియలు విరిగిపడిన గూడెంకొత్తవీధి మండలం చట్రాపల్లి గ్రామాన్ని గురువారం సీపీఎం నాయకుల బృదం సందర్శించింది. ఈ సందర్భంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. చట్రాపల్లిలోని గిరిజనులందరినీ బాధితులుగానే భావించి ప్రభుత్వం వారందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.గాయపడిన కుటుంబాలకు ఆర్థికంగా సాయం అందించాలని కోరారు. సీపీఎం తరపున బాధితులకు నిత్యవసరాలను అందజేశారు. కొండచరియలు విరిగిపడడంతో గృహాలు దెబ్బతిని తాము కట్టుబట్టలతో మిగిలామని పునరావస కేంద్రంలో తలదాచుకుంటున్న గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదుకుంటామని అధికారులు ప్రకటనలు ఇస్తున్నారు తప్పా ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి తగిన భరోసా కల్పించడం లేదని గిరిజనులు వాపోయారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాయకులు సత్యనారాయణ, బుజ్జిబాబు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.



చట్రాపల్లిలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న ఎస్ సంతోష్.

అరకులోయ రూరల్: మండలంలోని పద్మాపురం-రాజధాని కూడలిలో ఎస్‌ఐ సంతోష్ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనచోదకుల లైసెన్స్, రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణాను అడ్డుకునేందుకు విస్తృతంగా వాహన తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లైసెన్స్‌లు కలిగి ఉండాలని సూచించారు.

ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు

సీలేరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సీలేరు నుంచి పవర్‌హౌస్‌కు వెళ్లే ఘాట్‌రోడ్డులో బండ రాళ్లు , చెట్లు పడిపోయాయి.దీంతో ఈ మార్గంలో ప్రమాదాలు జరగకుండా జెన్‌కో అధికారులు అప్రమత్తమై రోడ్డుపై ఉన్న రాళ్లను కాంట్రాక్ట్ కార్మికుల ద్వారా వాటిని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చేశారు. గత 5 రోజులుగా మూగబోయిన బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్ వ్యవస్థ గురువారం సాయంత్రం నుండి అధికారులు పునరుద్ధరణ చేసారు.భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడడంతో సీలేరుకు సిగ్నల్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. దీంతో బ్యాంకు లావాదేవీలు, జెన్‌కో కార్యాలయాలు, ఇంటర్నెట్ సేవలు స్తంభించాయి. గురువారం సాయంత్రం నుంచి సిగ్నల్ వ్యవస్థ డొంకరాయి నుంచి మార్చి పునరుద్ధరణ చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో నెట్‌సేవలు అందుబాటులోకి వచ్చాయి.



పనులు చేస్తున్న కార్మికులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి



చింతపల్లిలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చింతపల్లి/ముంచంగిపుట్టు/రాజవొమ్మంగి: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ఆకస్మిక మృతికి జిల్లా వ్యాప్తంగా సీపీఎం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. జిల్లాలోని చింతపల్లి, ముంచంగిపుట్టు, రాజవొమ్మంగి మండలాల్లోని సీపీఎం నాయకులు ఏచూరి సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు చిన్నయ్యపడాల్, త్రినాథ్ తదితరులు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు అండగా నిలిచిన సీతారాం మరణం దేశానికే తీరని లోటు అని చెప్పారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. నాయకులు ధనంజ, సత్యనారాయణ, బాబూరావు, భీమరాజు,లైకోన్, శ్రీను, గిరిజన సంఘం నాయకులు రామారావు పాల్గొన్నారు.

పాడేరు ఎమ్మెల్యే సంతాపం

పాడేరు : సీపీఎం పార్టీ అగ్రనేత సీతారాం ఏచూరి మరణం విచారకరమని ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం తెలుపుతున్నట్టు పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదల పాలిట గొంతుకై నిజాయితీగా ప్రజల పక్షాన ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు.

శ్రమదానంతో గోతుల పూడ్చివేత

హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయతీ కేంద్రం నుంచి బంగారుమెట్ట వరకు రోడ్డు గుంతలు మయంగా మారడంతో ఎంపీటీసీ సభ్యురాలు కిల్లో మీనా ఆధ్వర్యంలో గుంతలను గ్రామస్తులు శ్రమదానంతో పూడ్చారు. ఆమె మాట్లాడుతూ రహదారి దెబ్బతినడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సాంబ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలని డిమాండ్

పాడేరు: స్థానిక గురుకుల విద్యాలయానికి రక్షణ గోడ నిర్మించాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఆనంద్ డిమాండ్ చేశారు. విద్యార్థినులకు రక్షణ కరువైందని అధికారులు స్పందించాలన్నారు. గిరిజన విద్యాలయాల్లో పూర్తిస్థాయిలో రక్షణ గోడలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ



గెమ్మెలిలో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కొండబాబు



కొత్తపాలెంలో రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాలయ్య, వైస్ ఎంపీపీ శారద తదితరులు

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి సచివాలయంలో సర్పంచ్ సీదరి కొండబాబు, నుర్మతి సచివాలయంలో సర్పంచ్ సూరిబాబు రైతులకు గురువారం రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. సబ్సిడీ విత్తనాలను వినియోగించుకొని వ్యవసాయాభివృద్ధి సాధించాలని వారు కోరారు. మాజీ సర్పంచ్ అప్పలనాయుడు, ఏఈవో ప్రశాంత్ పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని కొత్తపాలెం సచివాలయంలో గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలను జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పంపిణీ చేశారు.వాణిజ్య ప్రాధాన్యం ఉన్న రాజ్‌మా పంటను గిరిజనులు విస్తరించాలని రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. సర్పంచ్ వనగల సోమరత్నం, వైస్ ఎంపీపీ శారద, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు

వై.రామవరం: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీలో పీవీటీజీ (కొండరెడ్డి)ల ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన పీఎం జన్ మన్ సర్వేను సక్రమంగా పారదర్శకతతో నిర్వహించాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ళ లచ్చిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద లచ్చిరెడ్డి అధ్యక్షతన గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు, ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఆదివాసీలకు తెలియకుండా నాన్ పీవీటీజీల ద్వారా సర్వేలు జరుగుతున్నాయని, దీంతో అర్హులైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొండరెడ్డి కులస్తులుగా అడ్డదారిలో నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన కొంతమంది బినామీలు ఈ సర్వేలో పేర్లు నమోదు చేసుకుంటున్నారని ఆరోపించారు. వీటిని కట్టడి చేసేందుకు ప్రభుత్వాలు స్పందించి గ్రామాల్లో ఏర్పాటుచేసిన కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి ఆదివాసీలకు న్యాయం చేయాలనిరు. ఈ మేరకు ఎంపీడీఓ కె బాపన్నదొరకు వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకట లక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు, ఆదివాసీ సంఘం నాయకులు లింగారెడ్డి, సూరిబాబు, తిరుపతిరెడ్డి, తమ్మిరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలి

అరకులోయ రూరల్: కరకవలస వద్ద రైల్వే లైన్ బ్రిడ్జి వద్ద ఉన్న రోడ్డు దెబ్బతిందని, మరమ్మతులు చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాలదేవ్, నేతలు ఇన్‌చార్జి తహసీల్దార్ మత్స్యరాజులకు వినతిపత్రం ఇచ్చారు.

ఉత్తర్వుల ఉపసంహరణకు వినతి

ముంచంగిపుట్టు: పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫోటోలు తీసే ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ సచివాలయ సిబ్బంది ఎంపీడీవో కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ పనిని టీచర్లు వ్యతిరేకించడంతో ప్రస్తుతం తమకు అప్పగించడం తగదన్నారు. తమను కించపరిచి, వివక్ష చూపడం సరికాదని, ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం



పాత పాడేరులో వినాయక విగ్రహాన్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

సాక్షి, పాడేరు/ పాడేరు/ చింతపల్లి/ జి.మాడుగుల/ డుంబ్రిగుడ/రాజవొమ్మంగి: వినాయక చవితి వేడుకల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గణనాథుని నిమజ్జన ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పాడేరు, చింతపల్లి, జి.మాడుగుల, డుంబ్రిగుడ ప్రాంతాల్లోని పలుచోట్ల ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహాలను గురువారం సమీప గెడ్డల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పాత పాడేరులో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పాల్గొని గణనాథుని దర్శించుకొని పూజలు చేశారు.ఎమ్మెల్యే సమక్షంలో లడ్డు వేలం నిర్వహించారు. వేలం పాడిన భక్తుడికి ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు చేతుల మీదుగా లడ్డును అందజేశారు, వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం పట్టణ పురవీధుల మీదుగా థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలు, కాంగో మ్యూజికలతో ఊరేగింపు నిర్వహించి మండలంలో చిలకలగెడ్డలో నిమజ్జనం చేశారు. చింతపల్లిలోని కుమ్మరవీధి, నెయ్యిలవీధి, రామాలయం, మెట్టబంగళా, మైలుకూలీ వీధుల్లో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాలకు నిమజ్జనం చేశారు. పలు చోట్ల అన్నసమారాధనలు చేశారు. నృత్యాలు, డప్పుల వాయిద్యాల నడుమ ఊరేగింపు సాగింది. యువత సందడి చేశారు. జి.మాడుగుల మండలంలోని గాంధీనగర్‌లో అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నృత్యాలు, తప్పెటగుళ్ల నృత్యాలు, బాణాసంచా పేలుళ్లతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. వినాయకుని వేషధారణ ఆకట్టుకుంది. ఈదులబయలు గ్రామ సమీపంలోని గెడ్డలో వినాయకుని నిమజ్జనాన్ని నిర్వహించారు. డుంబ్రిగుడ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహాన్ని ఊరేగించి, సమీప గెడ్డలో నిమ్మజ్జనం చేశారు. రాజవొమ్మంగిలో విద్యుత్‌నగర్, నూకాలమ్మ గుడివీధి, మెట్టవీధి, యాదవుల కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలను ఊరేగించారు.



చింతపల్లిలోని కుమ్మరవీధిలో వినాయక విగ్రహం ఊరేగింపులో స్థానికులు



రాజవొమ్మంగిలోని ఊరేగింపులో స్థానికులు



జి.మాడుగులలోని తప్పెటగుళ్ల ప్రదర్శన



డుంబ్రిగుడలో వినాయకుడి ఊరేగింపు